# సరళ రేఖలు

'లక్ష్మి'

అప్పటికి సాయంత్రం అయ్యింది. బజారులో అందరూ తొందరగా తిరుగుతున్నారు త్వరగా ఇళ్ళకు చేరుకోవాలని శేఖర్ స్టూడియో బయటికి వచ్చాడు వాకిట్లో ఒకనాలుగైదేళ్ళ పిల్లవాడు ముద్దుగా ఉన్నాడు ఏడుస్తో నిల్చుని ఉన్నాడు. శేఖర్‌కు ఎందుకో అతని చూడగనే జాలివేసింది. ఆప్రక్కన నిల్చుకొని ఉన్న ఆయన్నుచూసి 'ఏమండీ! మీ అబ్బాయి గాబోలు ఏడుస్తున్నా' డన్నాడు.

" అబ్బే మా అబ్బాయి కాదండీ! ఎవరిపిల్లవాడో తప్పిపోయినట్లుంది. ఇందాకటినుండి ఏడుస్తూన్నాడు" అన్నాడు. ఆపెద్దమనిషి, కొంచెం సేపుఇక్కడే ఉంటే వాళ్ళవాళ్ళె వళ్ళైనా వచ్చి తీసుకెడతారు అనుకుంటూ ఆ అబ్బాయిని తీసుకెళ్లి లోపల కుర్చీమీద కూచోబెట్టాడు. అబ్బాయి ఏడుపు మానలేదు.

"ఎందుకేడుస్తావ్" అంటే

"అమ్మ" అనిఇంకా ఏడవడం మొదలు పెట్టాడు,

"అమ్మ ఎక్కడుంది"? అనడిగాడు శేఖర్.

"అమ్మ అని ఏడవటంకంటె, జవాబేమీ చెప్పలేదు అబ్బాయి. శేఖర్‌కు ఏమీతోచక పిల్లవాడినెత్తుకొని వాకిట్లోకి వచ్చాడు. మిఠాయి అమ్మవచ్చింది కొంచెంకొని పిల్లవాడిని లోపలికి తీసుకొని పోయినాడు. మిఠాయి తింటూ పిల్లవాడు కొంచెం ఏడుపును నిలిపాడు.

"నీపేరేమిటమ్మా" అడిగాడు శేఖర్,

"బాబు" అన్నాడు అబ్బాయి ముద్దుగా. శేఖర్ బాబుకు ఆగదిలో వ్రేలాడగట్టి వుండే చిత్రాలను చూపిస్తూన్నాడు "బాబూ? ఇది బాగుందా?" అంటే

"ఊఁ, బాగుంది. అంటూ మిఠాయి తింటూన్నాడు. ఆగదిలో అన్నిరకాల చిత్రాలు వ్రేలాడగట్టబడి ఉన్నాయి. వీధిలో యెవరైనా వెతుక్కుంటూ పోతున్నా రేమోనని చూస్తూన్నాడు శేఖర్. ఈలోపల అదో అమ్మ అని అరిచాడు బాబు. గబగబ శేఖర్ పిల్లవాడిని తీసుకొని వీధిలోకి వెళ్లి "ఏదీ. అమ్మ" అని అడిగాడు. పిల్లవాడు గదిలోపలికే చూపిస్తూన్నాడు. అమ్మలోపల ఉందా? శేఖర్‌కు ఆశ్చర్యమైంది. మెల్లగా లోపలికి వెళ్ళాడు ఎవరున్నారక్కడ? బాబువంక చూశాడు ఒకవిలువైన మాంటుమీద ఉండే చిత్రాన్ని చూపిస్తూన్నాడు. ఒక్కనిముషం స్తంభించి పోయినాడు. తన ఆరాధ్యదేవత, తనప్రణయిని, తనసర్వస్వం అని ఒకప్పుడు అనుకున్న సీత .... బాబు తల్లి. బాబును చూశాడు. సీత పోలికలున్నా యేమో అందుకే తననంతగా ఆకర్షించా డేమోనని. కాని కొంచెము గూడ పోలికలేదు. బాబుమాత్రం ఆ చిత్రాన్ని చూసి అమ్మఅని గంతులేస్తూన్నాడు శేఖర్ హృదయంలో యీ విషయం మరల రేగింది, అతనిమనస్సు 5 సంవత్సరాలు వెనుకకు పోయింది,

అప్పుడు, సీత తనదేనను కున్నాడు విధి బలవత్తరమైన శక్తితో ఆమెను అతని నుండి

విడదీసింది. మొదట స్నేహము మామూలు గానే కలిసింది. అతను బి. ఎ. ఆమె ఇంటర్ చదువుతూన్నారు. డిబేట్ జరిగింది ఇద్దరు ఒకే విషయాన్ని గురించి మాట్లాడారు. ఆమె చొరవకూ వాగ్ధాటికీ, పీటికితోడు అందానికీ శేఖర్ విస్మయుడైనాడు. తనకుతానే మొదట ఆమెను పలుకరించినాడు. ఆమెకూడ శేఖర్‌ను ఆదరించి గౌరవంగా మాట్లాడింది. ఒకదినం వాళ్ళింటికి టీకీ అహ్వానించింది. వాళ్ళప్పుడప్పుడుకలుసుకునేవారు శేఖర్ తల్లితండ్రులు వారి స్నేహానికి అడ్డు పెట్టలేదు. ఈస్నేహ మల్లా కొలది దినాలకు ప్రణయంగా మారింది. తర్వాత అది ప్రగాఢమైంది కాని ఇది ఎవరికీ తెలీదు. శేఖర్‌కు పరీక్ష లయిపోయాయి. ఏవేవో పెళ్లి సంబంధాలు రానుమొదలు పెట్టాయి శేఖర్ వద్దన్నాడు. ఇంట్లో పెద్దరాద్ధాంతం జరిగింది. ఆఖరుకు ఒకదినం విధిలేక వాళ్ళనాయ్యతోచెప్పాడు మెల్లిగా. సీతను ప్రేమించానని.

సీతనా! ...శేఖర్ తల్లిదండ్రులకొక పెద్ద పిడుగు పడ్డట్టయింది. తామా? ఏమీలేనివారు సీత ఊరిలోకల్లా ధనవంతునికూతురు, వాళ్లుతమ పిల్లను ఏమీలేనివాడికీ, తనరెక్కల కష్టంమీదనే ఆధారపడే వాడికి ఇస్తారా. అయినా అడగాలనుకున్నారు.

అనాటి సాయంత్రం కేరమ్సు ఆడుతూన్నపుడు సీతతో అన్నాడు తనకు పెండ్లి సంబంధాలొస్తున్నాయని. "ఎప్పుడు ముహూర్తమని" అడిగింది సీత తల ఎత్తకుండానే "నీకెప్పుడు దయగల్గితే అప్పుడే" అన్నాడు.

"నాయిష్టమెందుకు"

"నిజంగా అంటున్నావా సీతా?"

"మీరునిజంగా అడుగుతున్నారా? నాకంటె మంచివాళ్లు ఎంతోమంది దొరుకుతారు"

"లేదు సీతా లేదు. నేనుఇంకెవర్నీ చేసుకోను మీవాళ్ళు ఒప్పుకుంటే. అయినా మీరు గొప్ప వాళ్లు....

ఇంతలో ధడాలున తలుపుతెరుచు కొని సీత తండ్రి వచ్చారు. ఇద్దరూ సంభ్రమంతో తలలు వంచారు?

"సీతా! అమ్మ ఎందుకో పిలుస్తూంది" అన్నాడు. సీత ఒక్కసారి శేఖర్‌వంక చూసి వెళ్ళిపోయింది.

సీత తండ్రి అనంతరామయ్య సీరియస్‌గా వచ్చి శేఖర్ ఎదురుగా వచ్చి కూర్చున్నాడు. "శేఖరం! నీకొకసంగతి చెప్పాలనుకుంటున్నాను. నేనిప్పుడు మీరుమాట్లాడినదంతా స్పష్టంగా విన్నాను మా అమ్మాయిని వేరొకచోట ఇచ్చుటకు నిశ్చయించినాము. ఏదో స్నేహంగా ఉన్నా రనుకున్నాను గాని ఇల్లాంటి అభిప్రాయాలు మీలో నున్నవని తెలిస్తే ఎప్పుడో జాగ్రతపడి ఉండేవాడిని నిజానికి నాదేతప్పలే ఎదిగిన పిల్లల్ని స్వేచ్ఛగా తిరగనిస్తే ఎక్కడైన ఇలా జరక్కుండా పోతుందా? నీవునీ అభిప్రాయాన్ని వెంటనే మార్చుకో. ఇకమీద దయచేసి మాయింటికి రావద్దు. ఇంకమీద సీతతో మాట్లాడడానికి కూడవీల్లేదు." అన్నారు. శేఖర్ ఆయనధోరణి చూసి తెల్లబోయాడు. "నేను సీతను ఎంతో ప్రేమించాను నేనుకూడ బి. ఎ. చదివాను. మీకు సీతకంటే ఇంకెవరూ లేరు, నాకే ఇవ్వండి "అందామనుకున్నాడు కాని నోటమాట పెగిలి రాలేదు. కొంచెంసేపు నిస్తబ్ధుడై కూర్చున్నాడు. "నాకు సీతనుచేసుకోవాలని ఉంది." అన్నాడు "వీల్లేదు. సీతకు సంబంధం నిశ్చయమై పోయ్యింది. ఇకసీతను చూడటం కూడ పల్లపడదు. తమరు వెళ్ళిపోవచ్చు" అన్నాడు అనంతరామయ్య

ఇంక అక్కడ కూర్చోడటం కూడ మస్సు రామె పోయింది శేఖర్‌కు గబగబ ఇంటికి వచ్చేశాడు మెట్లుదిగి వస్తూండగా సీత ఎదురు పడింది అతనిప్రేమంతా ఒక్కసారి పొంగింది. గుండె దడదడ కొట్టుకుంది. కాని బాధ పడుతూన్న హృదయం నోరు తెరవనివ్వలేదు. ఒక్క

పలుకైనా పలుకకుండా వెళ్ళిపోయాడు తర్వాత ఇంతవరకూ ఆఫీసుకైనా వెళ్ళలేదు. ఇంట్లో వాళ్లకీవిషయం చూచాయగా తెలిసింది. శేఖర్‌నేమందలించారు అంతకంటె పిల్ల దొరకదా? ఎంతోమంది కట్నమిచ్చి పిల్లనిస్తామంటూ వస్తున్నారు అసలుగొప్పింటి పిల్ల మనింట్లో ఎలా మసలుకుంటుందిరా? అని వాపోయిందివాళ్లమ్మ శేఖరు దేనికి జవాబు చెప్పలేదు. ఎవ్వరితోనూ మాట్లాడే వాడు గాదు.

కొన్నిదినములైనతర్వాత సీతదగ్గరనుండి ఒకజాబు వచ్చింది "నిన్ను చూడవలెనని పరితపించి పోతున్నాను. ఒక్కసారి కనపడు" అని ప్రాధేయపడింది తననెవరో రెండో పెండ్లివాడికి డబ్బు నాశించి ఇస్తున్నారని, తనమనస్సంతా శేఖర్ పైనేవుందని వ్రాసింది శేఖర్ ఇంటినుండి కదలలేదు జవాబుకూడ ఇవ్వలేదు కాని దుర్భరమైన మానసిక యాతననుభవించినాడు. లోలోపలే క్రుంగి పోయాడు. మనస్సును మరోవైపుకు త్రిప్పకుండే దానికొరకై అదివరకు కొద్దిగా నేర్చుకున్న చిత్రరచన ప్రాక్టీసు చేయసాగాడు, ఎప్పుడూ చిత్రాలు గీయటమే పని అయింది అతని స్థితి చూచి అంగిగి గుండెలూ తల్లడిల్లనవి "ఇదేంబుద్ధిరా! అందని పండుకాశించి జీవితాన్ని నాశనం చేసుకుంటావా" అని అన్నయ్య ఎంతో బుజగించాడు కాని అతని తీరు మారలేదు.

సీత పెండ్లి వైభోగంగా చేశారు సీత కన్నీళ్ళతో వ్యాగియా గాతాన్ని దిగ్గించుకొంటి కాని శేఖరికి హృదయ శాంతి గలుగలేదు అక్కడి పేల్చేమందు గుండు శబ్దాలు అతనికి హృదయంపై సమ్మెట పోట్లయినాయి అందరికి శ్రావ్యమైనమేళం అతనిచెవుల్లో రొదపెట్టింది తనరూములోకెళ్ళి తలుపేసుకున్నాడు. అక్కడికీ వినిపిస్తూనే ఉన్నాయి. తలుపుతెరచుకుని బజారులోకి వెళ్ళిపోయాడు.

కొన్ని నెలలయింతర్వాత మళ్ళీ కొంచెం మామూలుగా నున్నట్టు కనబడ్డాడు. ఒక దినం భోజనాలపుడు తండ్రి "ఏమినాయనా అవధానాలుగారమ్మాయిని అడగొచ్చారు...." అంటూండగానే "క్షమించండి నాన్నాగారు! నేనీ యింట్లో ఉండాలని ఉంటే మీరు పెళ్ళి ప్రస్తావన ఎత్తవద్దు" అని లేచిపోయాడు. అంతే. ఇక ఆయింట్లో ఎప్పుడూ శేఖర్ పెళ్ళి ప్రస్తావన రాలేదు. శేఖర్ ఏ ఉద్యోగంలోను ప్రవేశించలేదు. ఒక స్టూడియోపెట్టి తన చిత్రాలు గీయటం మొదలు పెట్టాడు. రెండు సంవత్సరలలో మంచి పేరుతెచ్చుకున్నాడు. తర్వాత సీత చిత్రం గీశాడు. అంతా తద్రూపంగానే ఉందినది. దానిని తన ప్రైవేటు రూముకు పైగా తగిలించాడు. ప్రతిదినం ప్రొద్దున వచ్చేటప్పుడు రెండురోజా పూలు తెచ్చేవాడు. ఎప్పుడో సీత తనకు ఇచ్చిన జేబురుమాలులో పెట్టి తీసుకొని వచ్చేవాడు అవి ఆ చిత్రానికి అలంకరించేవాడు.

అప్పటినించిఇప్పటివరకు సీత సమాచారమే తెలియలేదు. అతను విచారించను గూడలేదు. ఇంట్లోవాళ్ళు గూడ ఎప్పుడూ సీత సమాచారం గాని అతని పెండ్లి సమాచారంగాని ఎత్తేవాళ్ళు గాదు ఆనాడు రోడ్డులో దొరికిన అబ్బాయి పిల్ల పూర్వపుగాథ అంతా ఒక్కసారి మెరుపులా మెరిసింది- కాని - వీడు సీతను అమ్మా అంటున్నాడు సీతకొడుకా? పరికించి చూశాడు. సీత పోలికలేవీ కనుపించలేదు అతనిలో వివిధభావాలు చెలరేగినాయి "ఆమె మీ అమ్మగారా" అని అడిగాడు. "ఔను మా అమ్మ" అన్నాడు బాలు. అయితే సీత ఈ ఊరికి వచ్చి ఉండా వీడు సీత కొడుకేనేమో! అనుకున్నాడు సీత తన్ను మరచి పోయిందా?

ఆదినం ఆ అబ్బాయిని ఇంటికి తీసుకెళ్ళాడు, రాత్రంతా ఆలోచించాడు ప్రొద్దున్నే లేచి

అబ్బాయితో గూడ పోలీసుస్టేషనుకు వెళ్ళాడు ఎవరైనా ఆ అబ్బాయి లక్షణాలు చెప్పి అడిగితే తన దగ్గరకు పంపించమని స్టూడియో అడ్రసు ఇచ్చి వెళ్ళాడు. అబ్బాయి "అమ్మ"ను చూస్తూ ఆడుకుంటూ కూర్చున్నాడు. శేఖర్‌కు ఆ దినం కుంచె సాగలేదు ఒక పల్లె పిల్ల బొమ్మను చిత్రిస్తున్నాడు ఎప్పటివలె అందాల కుంచె రంగులు దిద్దలేక పోయింది కుర్చీలో కూల బడ్డాడు. ఆలోచనా ప్రవాహానికి అడ్డంగా ఎవరి గొంతో వినబడింది. లేచిచూస్తే ఒక పెద్దాయన. సుమారు 45 ఏండ్లుంటాయి.

"మీరేనా శేఖర్ అంటే" అన్నాడు వచ్చి నాయన.

"అవును. రండి కూర్చోండి" అన్నాడు. పిల్లవాడు "నాన్నా" అని అతనిమీదకి దూకినాడు.

"మీ పిల్లవాడా ఇతను" అని అడిగాడు శేఖర్.

"అవునండీ నిన్న సాయంత్రంనుంచి కనబడ లేదు. వెదకి వెదకి వేసారి ఈదినం ప్రొద్దున్నే పోలీసు స్టేషనులో కనుక్కున్నాం. నమ స్కారాలు- మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేం. తల్లిలేని పిల్లవాడు "

అయితే సీత కొడుకుకాదూ? "తల్లిలేదా" అన్నాడు శేఖర్

"అవునండి తల్లి చిన్నప్పుడే చనిపోయింది రెండవ పెండ్లి చేసుకున్నాను. ఆ అమ్మాయి చిన్నదేలేండి, నాలుగు సంవత్సరాలయింది కాని నోరుతెరచి ఒక్కమాట నాతో మాట్లాడలేదు. చేసుకున్నానే గాని ఏమీ సుఖంలేదు అనుభవం లేదు. పిల్లవాడ్ని మాత్రంబాగానే చూసుకుంటుంది. వాడికి ఆమె అమ్మ. ఎప్పుడూ దిగులుగా ఉంటుంది వయసు మళ్ళింతరువాత పెళ్ళిచేసుకోవడం బుద్ధి తక్కువండీ. కాని పిల్లవాడి కోసరం....

శేఖర్ మనస్సు ఎక్కడికో పోతూంది సీత ఇంకా తనను మరచిపోలేదా? తనలాగే యాతన పడుతుందా? అయ్యో నా వల్ల సీతకు కూడా జీవితం ఒక ఎడారైపోయింది, ఆ వచ్చినాయన శేఖర్ పరధ్యానాన్ని గమనించాడు "ఏమండీ ఆలోచిస్తున్నారు" అన్నాడు. "అబ్బే! ఏంలేదు ఆమె ఎందుకలా ప్రవర్తిస్తూందా అని ఆలోచిస్తు న్నాను" బదులు చెప్పాడు శేఖర్. వచ్చినాయన రూముచుట్టు ప్రక్కలా చూచి అన్ని చిత్రాలు చూచాడు. సీత చిత్రంచూచి, విభ్రాంతి పడి పోయాడు. "ఈమె మీకు తెలుసాండి?" అని అడిగాడు శేఖరుకు ఏంచెప్పాలో తోచలేదు. "ఒకసారి ఎప్పుడో చూచినట్లు జ్ఞాపకం. ఎవరో కూడ తెలీదు. కాని ఆమె చిత్రం గీయాలని బుద్ధి పుట్టింది, గీశాను, ఎలాగుందో" అన్నాడు "అచ్చు ఆమెలాగనే ఉంది. ఈమె నా భార్య. రెండవభార్య సీత."

"నిజంగానా!" అన్నాడు శేఖర్, అంత కంటే ఏమీ అనలేక పోయాడు వందన సమర్ప ణంతో ఒక పచ్చనోటు బహుమతి ఇవ్వబోయాడు [illegible] వద్దన్నాడు. వాళ్ళు వెళ్ళిపోయారు. కాని శేఖర్ మనస్సులో తుఫాను చెలరేగింది ఇంటికి వెళ్ళినా ప్రశాంతి దొరకలేదు. మరునాటిదినం స్టూడియోకి వచ్చాడు. మామూలు ప్రకారం రోజాపూలు తెచ్చాడు సీతకు అలంకరించిన తర్వాత ఏదో తెలియని తృప్తి కొంచెం చిక్కింది ఎదు రుగా టేబిల్ మీద సీత ఇచ్చిన రుమాలు కనబ డింది "నన్ను మరచిపోకూడదుసుమా, ఇది నా జ్ఞాపకార్థం" అన్న సీత మాటలు ధ్వనించి నాయి శేఖర్ కండ్లలో నీళ్లు నిలిచాయి.

